# బ్రహ్మోత్సవాలకు యజ్ఞవరాహ క్షేత్రం ముస్తాబు



ముస్తాబైన యజ్ఞవరాహస్వామి ఆలయం



ఆలయ ఆవరణలో వేసిన చలువ పందిళ్లు

- **నేటి నుంచి ఆరు రోజుల పాటు ఉత్సవాలు**
- **భక్తులకు ఏర్పాట్లు**

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 29: జిల్లా కేంద్రంలోని బొమ్మకల్ రోడ్డులో గల యజ్ఞవరాహ స్వామి ఆలయం 37వ వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఆలయాన్ని రంగవల్లులు, పూలు, రంగులతో శోభాయమానంగా అలంకరించారు. సోమవారం నుంచి శనివారం వరకు వేద పండితుల ఆధ్వర్యంలో తిరుమలను తలపించే రీతిలో ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు సర్వవైదిక సంస్థానం ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా, 30న అంకురార్పణ, 31న ఉదయం ధ్వజారోహణం, స్నపన తిరుమంజనం, సాయంత్రం ఎదుర్కోలు, హిరణ్యాక సంహార లీల, శేషవాహనం, ఒకటిన ఉదయం మోహినీ ఉత్సవం, కల్యాణ మహోత్సవం, సాయంత్రం గరుడసేవ, 2న ఉదయం హనుమంత వాహనం, మహాభిషేకం, సాయంత్రం ఉండలిసేవ, ముత్యాల పందిరి వాహనం, 3న ఉదయం సూర్యప్రభ వాహనం, హలంగిసేవ, తిరుపావడ సేవ, అష్టదళ పాదపద్మారాధన, సాయంత్రం మహాశాంతి హోమం, సహస్ర దీపాలంకరణ, గజ వాహన సేవలు, 4న ఉదయం రథోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, సాయంత్రం శ్రీపుష్ప యాగంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని భక్తులు పాల్గొని శ్రీవారి కృపకు పాత్రులు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# అత్యవసర సేవల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ అవకాశం

- **నవంబర్ 7లోగా దరఖాస్తులను ఎన్నికల అధికారులకు అందజేయాలి**

కలెక్టరేట్, అక్టోబర్ 29: అత్యవసర సేవల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది రాబోయే సాధారణ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకునే క్రమంలో పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఈమేరకు ఉత్తర్వులు కూడా విడుదల చేసింది. అయితే, ముందుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉన్న దృష్ట్యా నవంబర్ 7వ తేదీలోగా నిర్ణీత ఫాం 12(డీ) పూర్తి చేసి, సంబంధిత నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు అందజేయాలని ఈసీ విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. పదమూడు అత్యవసర సేవలకు సంబంధించిన విభాగాల్లో పనిచేసే సిబ్బందితో పాటు ఈసారి జర్నలిస్టులకు కూడా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయవచ్చని వెల్లడించింది. వైద్య ఆరోగ్య శాఖ, అగ్నిమాపక శాఖ, రోడ్డు రవాణా సంస్థలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, ఎన్నికల సంఘం అనుమతించిన పాత్రికేయులు, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, పౌరసరఫరాల సంస్థ గిడ్డంగుల్లోని సిబ్బంది, విద్యుత్ ఉద్యోగులు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ, దూరదర్శన్, ఆలిండియా రేడియో, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, బీఎస్ఎన్ఎల్, తదితర సంస్థల్లో పనిచేసే సిబ్బందికి ఆబ్సెంట్ ఓటర్స్ కింద పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకునే వెసులుబాటు లభించింది. జర్నలిస్టులు మాత్రం ఎన్నికల సంఘం పాసులు కానీ, ప్రభుత్వం మంజూరు చేసే అక్రిడిటేషన్ అయినా కలిగి ఉండాలని సూచించింది. ఫాం 12(డీ) దరఖాస్తులు నోడల్, రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల నుంచి పొందవచ్చు. ఎన్నికల సంఘం పోర్టల్ నుంచి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ప్రత్యేకంగా పోస్టల్ ఓటింగ్ సెంటర్ అందుబాటులో ఉంటుందని, ఒకసారి పోస్టల్ బ్యాలెట్ కోసం నిర్ణీత ఫాం ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి ఎట్టి పరిస్థితుల్లో పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసే అవకాశం ఇవ్వరని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

# కుల గణన చేయని బీజేపీని ఓడిస్తాం



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి పటేల్

తెలంగాణచౌక్, అక్టోబర్ 29: బీసీ కుల గణన చేయకుండా రాష్ట్రంలో బీజేపీ గెలిస్తే బీసీని ముఖ్యమంత్రి చేస్తామని హోం మంత్రి అమిత్‌షా చేసిన హామీ బూటకమేనని తెలంగాణ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి పటేల్ పేర్కొన్నారు. నగరంలోని సంఘు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీజేపీ బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నదని మండిపడ్డారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి బీసీలపై కపట ప్రేమను చూపుతోందన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టి నాటి నుంచి బీసీల కులగణన ఎందుకు చేపట్టలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీ కుల గణన కోసం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనలు, పార్లమెంట్ ముట్టడి చేసినా ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా పట్టించుకోలేదన్నారు. దేశ జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించలేని బీజేపీ బీసీని సీఎం చేస్తామని చెబితే రాష్ట్రంలోని బీసీలు నమ్మరని తెలిపారు. బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన బీజేపీ దేశంలోని బీసీల అభివృద్ధి కోసం చేసిందేమిలేదన్నారు. తెలంగాణలో బీజేపీని ఓడించడానికి బీసీలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం నాయకులు రమేశ్, అజయ్, అశ్విన్, వేణుగోపాల్, ఆంజనేయులు, కోటేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీకేఎంయూ నాయకులు

తెలంగాణచౌక్, అక్టోబర్ 29: పాట్నాలో వచ్చే నెల 2 నుంచి 5 తేదీ వరకు జరిగే బీకేఎంయూ 15వ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ పిలుపు నిచ్చారు. నగరంలోని బీకేఎంయూ కార్యాలయం (బద్దం ఎల్లారెడ్డి భవనం)లో ఆదివారం మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన జిల్లా కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొయ్యడ సృజన్ కుమార్ మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరణ పేరుతో వ్యవసాయ రంగాన్ని తమ అనుకూల బడా వ్యాపారవేత్తలకు అప్పగించాలని కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బోయిని అశోక్, ఉపాధ్యక్షుడు స్వామి, నాయకులు అంకూస్, అంజయ్య, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

## సబ్ జూనియర్ ఖోఖో జట్ల ఎంపిక పోటీలకు స్పందన



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఖోఖో అసోసియేషన్ బాధ్యులు

కొత్తపల్లి, అక్టోబర్ 29: జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా ఖోఖో జట్ల ఎంపిక పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లా కేంద్రంలోని సెయింట్ జాన్స్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఈ పోటీలకు జిల్లాలోని చొప్పదండి, మానకొండూర్, కోరుట్ల, పెద్దపల్లి, మెట్‌పల్లి, వేంపేట, కొడిమ్యాల, సిరిసిల్ల, మంథని, మాదాపూర్, సారంగపూర్ తదితర గ్రామాల నుంచి 200 మంది బాలురు, 130 మంది బాలికలు హాజరయ్యారు. కాగా, ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు నటరాజు రవి, ఆర్ఐ కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి వై మహేందర్‌రావు హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. అనంతరం పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నవంబర్ 15 నుంచి 17 వరకు తుఫ్రాన్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. ఈ పోటీల నిర్వహణలో ఖోఖో అసోసియేషన్ సభ్యులు చిట్టి తిరుపతి రెడ్డి, ఎం సమ్మిరెడ్డి, గంగాధర్, వంగపల్లి సూర్యప్రకాశ్, కట్ట సంతోష్, ప్రసాద్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



వేదికపై గురువులతో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 29: కరీంనగర్‌లోని పాతబజార్‌లో గల సాధన హైస్కూల్‌లో 1998-99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఓ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులను నేర్పిన గురువులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కామారం చిన్నప్ప, ప్రధానోపాధ్యాయుడు వరప్రసాద్, ఉపాధ్యాయులు కాత్యాయనీ, అజయ్‌కుమార్, సత్యం, అనిల్‌కుమార్, చంద్రశేఖర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## సాహితీ రికార్డు పురస్కారాల ప్రదానోత్సవం



అవార్డులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 29: నగరంలోని ఫిలింభవన్‌లో ఆర్యాణి సకల కళా వేదిక కరీంనగర్, గౌతమేశ్వర సాహితీ కళా సేవా సంస్థ మంథని సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయి సాహితీ రికార్డు పురస్కారాల ప్రదానోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి, భవానీ సాహిత్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కవులు కవిత్వం రాయడంలో మెలకువలను గ్రహించి చక్కని కవిత్వాన్ని సాహితీ లోకానికి అందించాలని సూచించారు. 60 మంది కవులకు వైరాగ్యం ప్రభాకర్, గౌతమేశ్వర సాహితీ కళా సేవా సంస్థ వ్యవస్థాపకుడు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పొర్ల వేణుగోపాలరావు, మోటూరి నారాయణరావు, రమాదేవి కులకర్ణి, జనశ్రీ జనార్దన్, ఎక్కలదేవి మోహన కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 5 నుంచి డ్రాయింగ్, టైలరింగ్‌లో శిక్షణ తరగతులు

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 29 : జిల్లా కేంద్రంలోని వాణీనికేతన్ కిడ్స్ కేర్‌లో రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగం ఆధ్వర్యంలో లోయర్, హయ్యర్ డ్రాయింగ్, టైలరింగ్‌లో శిక్షణ తరగతులను నవంబర్ 5వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు తెలంగాణ ఆర్ట్, ఫిజికల్, వర్క్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పేరు నవంబర్ 5లోగా నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ నంబర్ 98493 02904, 75694 04785లో సంప్రదించాలని పేర్కొన్నారు.